# ఢిల్లీకి చేరిన ఈటల–బండి వివాదం

## హైకమాండ్ స్పందనపై ఉత్కంఠ.. నేడు నడ్డాతో రాంచందర్‌రావు భేటీ



హైదరాబాద్, జూలై 20:

భారతీయ జనతా పార్టీ నేతలైన మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ల మధ్య సాగుతున్న మాటల యుద్ధం ఢిల్లీ వరకూ చేరింది. పార్టీ వర్గాలలోనే కాకుండా రాజకీయంగా ఇతర పార్టీల మధ్య కూడా ఈ వివాదం చర్చనీయాంశంగా మారింది. ఈటల చేసిన విమర్శలు తీవ్రతరం కావడంతో బీజేపీ జాతీయ నాయకత్వం దీనిపై ఎలా స్పందిస్తుందన్న దానిపై ఉత్కంఠ నెలకొంది.

**హైకమాండ్‌కు నివేదికలు?**

ఈటల రాజేందర్ ఇటీవల బండి సంజయ్‌పై బహిరంగంగా విమర్శలు చేయడంతో రాష్ట్ర బీజేపీ నాయకత్వం వెంటనే స్పందించింది. శనివారం రోజునే ఈటల వ్యాఖ్యలకు సంబంధించిన వీడియో క్లిప్పింగ్‌లను పార్టీ కేంద్ర అధిష్ఠానానికి పంపించగా, ఆదివారం మరో విపుల నివేదికను అందించినట్లు సమాచారం. ఈ నివేదికలో ఈటల బీజేపీలో చేరిన నాటి నుంచి ఇప్పటివరకు ఆయన్ను పార్టీ ఎలా గౌరవించి, ప్రాధాన్యత ఇచ్చిందో వివరించారు. ఈటల 2021లో బీజేపీలో చేరిన వెంటనే హుజూరాబాద్ ఉపఎన్నికలో టిక్కెట్ ఇచ్చారు. ఆయన గెలుపుకోసం రాష్ట్రవ్యాప్తంగా వేలాదిమంది కార్యకర్తలు, ఆరెస్సెస్ వలంటీర్లు వచ్చి పని చేశారు. చెట్ల కింద ఉంటూ ఉంటూ, స్వంతంగా భోజనాలు సమకూర్చుకున్నారు. ఇంటింటికీ తిరిగారు. ఈటల గెలుపును వ్యక్తిగతంగా భుజాల మీదు వేసుకొని పనిచేశారు.

**ఈటల ఆరోపణల్లో వాస్తవమెంత?**

ఈటల పార్టీలో చేరిన కొద్దికాలానికే జాతీయ కార్యవర్గ సభ్యుడిగా నియమితులయ్యారు. అంతేకాదు, జాయినింగ్స్ కమిటీ బాధ్యతలతో పాటు పలువురు కీలక నేతలతో బంధాలను ఉపయోగించుకునే అవకాశం ఇచ్చారు. అయినా ఒక్క ముఖ్య నేతను కూడా పార్టీలోకి చేర్చలేకపోయారన్న ఆరోపణలు నివేదికలో ఉన్నాయి. ఇక హుజూరాబాద్, గజ్వేల్ నియోజకవర్గాల నుంచి పోటీ చేసే అవకాశం ఇచ్చినప్పటికీ ఆయన ఓడిపోయారు. అయినప్పటికీ మల్కాజిగిరి పార్లమెంట్ స్థానం నుండి పోటీ చేసి గెలవడంలో పార్టీ కీలక పాత్ర పోషించిందని హైకమాండ్‌కు నివేదికలో వివరించారు.

**60 శాతం పదవులు ఈటల వర్గానికే?**

ఈటల అనుచరులకు బీజేపీలో సరైన ప్రాధాన్యత లభించలేదనే ఆరోపణలు తాజాగా వినిపిస్తున్నప్పటికీ, కరీంనగర్ జిల్లా స్థాయిలో మద్దతుదారులకు భారీగా పదవులు ఇచ్చినట్టు పార్టీ వర్గాలు వెల్లడించాయి. జిల్లా, మండల, బూత్ కమిటీల జాబితాలో 60 శాతానికి పైగా పదవులు ఈటల వర్గానికే లభించాయని పేర్కొన్నారు.

**నడ్డా, మోదీ, అమిత్‌షాలతో భేటీలు**

సోమవారం నుంచి పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కానుండడంతో బీజేపీ కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ఇతర ఎంపీలు ఆదివారం ఢిల్లీకి చేరుకున్నారు. ఈటల మాత్రం సోమవారం ఉదయం ఢిల్లీకి వెళ్లనున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు కూడా సోమవారం ఢిల్లీకి వెళ్లి పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాతో భేటీ అవనున్నారు. ఈ సందర్భంగా ఈటల–సంజయ్ వివాదం ప్రస్తావనకు వచ్చే అవకాశం ఉన్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. అలాగే ప్రధాని మోదీ, హోంశాఖ మంత్రి అమిత్‌షాలను కూడా రాంచందర్‌రావు మర్యాదపూర్వకంగా కలవనున్నారు. ఈ పరిణామాలన్నీ చూస్తే బీజేపీలో అంతర్గత కలహాలు మరింత ముదురుతున్నట్టు స్పష్టమవుతోంది. హైకమాండ్ ఏ నిర్ణయం తీసుకుంటుందో అన్న ఉత్కంఠ మాత్రం ఇంకా కొనసాగుతోంది.

# రాహుల్‌తో కలిసి ప్రధాని వద్దకు!

- బీసీ రిజర్వేషన్ల పెంపునకు సహకరించాలని మోదీని కోరనున్న సీఎం రేవంత్
- మోదీ అపాయింట్‌మెంట్ కోసం యత్నం
- బీసీ బిల్లుల అంశంపై పార్లమెంటులో చర్చ కోసం పట్టుబట్టాలని నిర్ణయం
- రిజర్వేషన్ల పెంపుపై ఇండియా కూటమి ఎంపీలకు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్
- ఇందుకోసం రెండు, మూడు రోజులు ఢిల్లీలోనే ఉండనున్న ముఖ్యమంత్రి
- కార్యాచరణపై భట్టి, ఉత్తమ్‌లతో భేటీ
- బీసీ బిల్లులతోపాటు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, వనరుల సమీకరణపైనా చర్చ

హైదరాబాద్, జూలై 20 :

తెలంగాణలో బీసీ రిజర్వేషన్ల పెంపునకు సహకరించాలని ప్రధాని మోదీని కోరాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భావిస్తున్నట్టు తెలిసింది. ఇందుకోసం కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీతో కలిసి వెళ్లి మోదీతో భేటీ అయ్యే అవకా శం ఉందని, ఈ మేరకు ప్రధాని అపాయింట్‌మెంట్ కోసం ప్రయత్నిస్తున్నారని సమాచారం. తెలంగాణలో చేపట్టిన కులగణన, అందులో వెల్లడైన వివరాలు, అసెంబ్లీ ఆమోదించి కేంద్రానికి పంపిన బీసీ రిజర్వేషన్ల పెంపు బిల్లులు తదితర అంశాలను ప్రధాని దృష్టికి తీసుకెళ్లను న్నారని తెలిసింది. సోమవారం నుంచి పార్లమెంటు సమా వేశాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో.. ఈ సమావేశా ల్లోనే బీసీ రిజర్వేషన్ల అంశంపై నిర్ణయం తీసుకో వాల్సిందిగా విజ్ఞప్తి చేయనున్నట్టు సమాచారం. విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వే షన్లపై అసెంబ్లీలో ఆమోదించి, రాజ్యాంగంలోని 9వ షె డ్యూల్‌లో చేర్చాలంటూ కేంద్రానికి పంపిన బిల్లులపై పార్ల మెంటులో చర్చ పెట్టించి, ఆమోదింపజేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకోసం దేశవ్యాప్తంగా ఇండి యా కూటమి మద్దతు కూడగట్టాలని సీఎం రేవంత్ నిర్ణ యించారు. ఆ దిశగా ప్రయత్నాలు ముమ్మరం చేశారు. కేంద్రంపై అన్ని వైపుల నుంచీ ఒత్తిడి తెచ్చేందుకు సిద్ధమ య్యారు. పార్లమెంటు సమావేశాల్లో చర్చకు వీలుగా ఇండియా కూటమి ఎంపీలకు.. తెలంగాణలో కులగణన వివరాలు, రిజర్వేషన్ల పెంపు ఆవశ్యకత, రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించి కేంద్రానికి పంపిన బిల్లులపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. ఈ మేరకు ఢిల్లీ వెళ్లనున్న సీఎం రేవంత్.. రెండు, మూడు రోజులు అక్కడే ఉండనున్నారు.

**రాహుల్, సీఎంతో కలసి ప్రధానితో భేటీ అవుతాం: ఎంపీ చామల**

తెలంగాణలో 42శాతం బీసీ రిజర్వేషన్లు కల్పించేందుకు అసెంబ్లీలో ఆమోదించి, కేంద్రానికి పంపిన బిల్లులపై లోక్‌సభలో గళం విప్పుతామని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. ఈ విషయంలో ఇండి కూటమి ఎంపీలందరి మద్దతు కూడగడతామని తెలిపారు. సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి ఢిల్లీలో రాహుల్ గాంధీతో చర్చిస్తారని, ఇండి కూటమి ఎంపీలతోనూ ప్రత్యేకంగా మాట్లాడతారని వెల్లడించారు. రాహుల్, రేవంత్, భట్టిలతో వెళ్లి మోదీని కలుస్తామని, రాజకీయాలను పక్కనపెట్టి బిల్లులను ఆమోదించాలని కోరుతామని చామల తెలిపారు. ప్రధాని మోదీ ఓబీసీల విషయంలో సానుకూలంగానే వ్యవహరిస్తున్నారని.. బీసీ బిల్లుల విషయంలోనూ సానుకూలంగానే ఉంటారని ఆశిస్తున్నామని చెప్పారు. మెట్రో రెండోదశ విస్తరణ, రీజినల్ రింగు రోడ్డు ఉత్తర భాగం పనులు వేగవంతం చేయడంతోపాటు, మూసీ పునరుజ్జీవనానికి నిధులు ఇవ్వాలని పార్లమెంటు లో డిమాండ్ చేయనున్నట్టు తెలిపారు.

**భట్టి, ఉత్తమ్‌లతో సీఎం భేటీ**

అసెంబ్లీలో ఆమోదించి కేంద్రానికి పంపిన బీసీ బిల్లుల విషయంలో చేపట్టాల్సిన కార్యాచరణపై ఆదివారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్‌లతో సీఎం రేవంత్ భేటీ అయి చర్చించారు. ఆదివారం సాయంత్రం సీఎం నివాసంలో సుదీర్ఘంగా జరిగిన ఈ సమావేశంలో బీసీ బిల్లుల ఆమోదానికి ఉన్న ప్రాముఖ్యత, రాష్ట్రంలోని ప్రత్యేక పరిస్థితులు, కులగణన వివరాలు, స్వతంత్ర నిపుణుల కమిటీ అధ్యయనం చేసి చెప్పిన ఫలితాలను కేంద్రానికి వివరించాలని నిర్ణయించినట్టు తెలిసింది. అలాగే ఈ అంశంపై రాహుల్‌గాంధీతోపాటు కాంగ్రెస్ అధిష్ఠానం పెద్దలతో భేటీకావాలని నిర్ణయానికి వచ్చారు. ఇక ఈ భేటీలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, ఆర్థిక వనరుల సమీకరణ తదితర అంశాలపైనా చర్చించినట్టు తెలిసింది.



## చింతలపల్లి అభివృద్ధికి మంత్రి సురేఖ హామీ

శెనార్తి మీడియా,శంకరపట్నం :

శంకరపట్నం మండలంలోని చింతలపల్లి గ్రామానికి అభివృద్ధి నిధులు మంజూరు చేస్తానని మంత్రి కొండా సురేఖ హామీ ఇచ్చారు. బీరప్ప దేవాలయ నిర్మాణానికి 10 లక్షల రూపాయలు కేటాయించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఆదివారం మండల కేంద్రంలో జరిగిన విలేకరుల సమావేశంలో యాదవ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గొర్ల ఐలేష్ యాదవ్, రాష్ట్ర కార్యదర్శి కేశవేణి రవి యాదవ్, జిల్లా అధ్యక్షుడు గొర్ల కొమురయ్య యాదవ్ వివరించారు.వారితో పాటు మంత్రి సురేఖ, రాజ్యసభ సభ్యుడు మాందాడి అనిల్ కుమార్, ఎమ్మెల్యే కవంపల్లి సత్యనారాయణ ఉన్నారని చెప్పారు. రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ కూడా చింతలపల్లి శ్రీకృష్ణ యాదవ సంఘం కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి మరో 10 లక్షల నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.చింతలపల్లి గ్రామ అభివృద్ధికి తమ సహకారం అందించిన మంత్రి, రాజ్యసభ సభ్యుడు, ఎమ్మెల్యేలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కేశవ వేణి, అశోక్, జింక రాజయ్య యాదవ్, ఉపాధ్యక్షులు ముక్కెర కొమురయ్య యాదవ్, భోగిని రాజయ్య యాదవ్, కేశవేణి సమ్మయ్య యాదవ్, బోయిన ఐలయ్య, బోయిని రాజయ్య, అమరకొండ ఓదెలు, జక్కుల తిరుపతి, మంగా రమేష్, కేశవేణి రాజు తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల రక్షణలో వర్క్ మెన్ ఇన్‌స్పెక్టర్ల పాత్ర కీలకం

శెనార్తి మీడియా, మంచిర్యాల :



పని ప్రదేశాలలో ప్రమాదాల నివారణకు, కార్మికులకు రక్షణ కల్పించడంలో వర్క్ మెన్ ఇన్స్పెక్టర్ ల పాత్ర కీలకమని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి)రాష్ట్ర అధ్యక్షుడు వాసి రెడ్డి సీతా రామయ్య అన్నారు. ఆదివారం పట్టణంలోని యూనియన్ కార్యాలయంలో యూనియన్ బెల్లంపల్లి బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేష్ అధ్యక్షతన ఏరియా వర్క్ ఇన్స్పెక్టర్ల సమావేశం నిర్వహించగా, ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జూలై 25న డీజీ ఎంఎస్ ఆధ్వర్యంలో సేఫ్టీ సమావేశం నిర్వ హించడం జరుగుతుందని, వర్క్ మెన్ ఇన్స్పెక్టర్లు సేఫ్టీ పర్సన్ గా వాహిలేషన్స్ ను అబ్జర్వ్ చేసి, డిజిఎంఎస్ దృష్టి కి తీసుకుపోవాలని సూచించారు. అదేవిధంగా మిగ తా అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి, సేఫ్టీ పర్సన్ గా కార్మికు లకు, యాజమాన్యానికి సూచనలు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా కేకే 5 గనికి చెందిన మెకానికల్ ఫోర్ మెన్, సిఐటియు నాయకుడు కోరే సిద్ధాంత యూనియన్ లో చేరగా, ఆయనకు యూనియన్ కండువా కప్పి, సాధారణ యూనియన్ లోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్రాంచ్ కార్యదర్శి శైలేంద్ర సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు భీమనాథుని సుదర్శన్, జాయింట్ కార్యదర్శి కంది శ్రీనివాస్, మైనింగ్, ఎలక్ట్రికల్, మెకానికల్ వర్క్ మెన్ ఇన్ స్పెక్టర్లు, అన్ని గనుల, విభాగాల పిట్ కార్యదర్శులు, నాయకులు పాల్గొన్నారు.

# ఎఫ్‌సీఐలో షోకాజ్ నోటీసుల కలకలం

- నాణ్యత లేకపోయినా సీఎంఆర్‌కు గ్రీన్‌సిగ్నల్
- మిల్లర్లతో కొందరు అధికారులు మిలాఖత్
- పొరుగు రాష్ట్రాల ఫిర్యాదులతో నోటీసులు

హైదరాబాద్, జూలై 20 :

భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ)లో అధికారులు, సాంకేతిక సిబ్బందికి జారీ చేసిన షోకాజ్ నోటీసులు కలకలం రేపుతున్నాయి. ప్రజా పంపిణీ కోసం ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేసిన బియ్యంలో నాణ్యత లోపించిందని, నూకల శాతం ఎక్కువగా ఉందని, రంగు మారిపోయాయని వచ్చిన ఫిర్యాదుల మేరకు హైదరాబాద్‌లోని ఎఫ్‌సీఐ తెలంగాణ ప్రాంతీయ కార్యాలయం నుంచి వివిధ జిల్లాల్లోని గోదాముల నిర్వాహకులకు నోటీసులు జారీ అయ్యాయి. రైస్ మిల్లర్లు ఇచ్చిన కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్)ను తూతూ మంత్రంగా పరిశీలించి, గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన టెక్నికల్ అసిస్టెంట్లు, మేనేజర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేయగా.. సంజాయిషీ ఇచ్చే పనిలో వారు నిమగ్నమయ్యారు. సాధారణంగా ఒక టెక్నికల్ అసిస్టెంట్ పాస్ చేసిన బియ్యంలో నాలుగో వంతును మేనేజర్ తిరిగి పరీక్షించాలి. అప్పుడే సీఎంఆర్ బియ్యం గోదాముల్లోకి చేరాలి. ఆ తర్వాత కేంద్రం ఇచ్చే ఇండెంటుకు అనుగుణంగా రైల్వే వ్యాగన్లు లోడ్ చేసి ఇతర రాష్ట్రాలకు పంపించాలి. కానీ, ఎఫ్‌సీఐ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని, రైస్ మిల్లర్లతో మిలాఖత్ అయి ఇష్టారాజ్యంగా బియ్యం పాస్ చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. తాజాగా ఏపీలోని నెల్లూరు జిల్లాకు తెలంగాణ నుంచి ఎఫ్‌సీఐ పంపించిన బియ్యం నాణ్యత లేవని, నిజామాబాద్ జిల్లాలోని గొడౌన్లలో రైస్ మిల్లర్లు ఎలా ఇస్తే అలా సీఎంఆర్ బియ్యం తీసుకుంటున్నారని ఫిర్యాదులు వచ్చాయి. వీటితో పాటు పలు జిల్లాల్లో ఎఫ్‌సీఐ గోదాముల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉందని, ఫ్యూమిగేషన్ సరిగా చేయకపోవటం, బస్తాల మధ్యలో పద్ధతి ప్రకారం మందు గోలీలు ఉంచకపోవటం, కొన్నిచోట్ల పురుగులు పట్టి దెబ్బతిన్నట్లు వచ్చిన ఫిర్యాదులపై విచారణ మొదలుపెట్టారు. రైస్ మిల్లర్లు ఇచ్చిన సీఎంఆర్ యథాతథంగా పాస్ చేసి, గోదాములకు తరలించినచోటే సమస్యలు వస్తున్నాయి. నాణ్యతా ప్రమాణాలు పాటించినచోట రావటంలేదు. ప్రతి ఉమ్మడి జిల్లాలో 5నుంచి 10 మంది వరకు షోకాజ్ నోటీసులు అందుకున్నారు.

# గంజాయికి దూరంగా ఉండండి



- సంగారెడ్డి బోనాల జాతరలో యువతకు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి హితబోధ
- చెడు అలవాట్లతో తల్లిదండ్రులను బాధపెట్టొద్దు
- గంజాయి, మద్యాన్ని పక్కనబెట్టి భవిష్యత్తు గురించి ఆలోచించాలని పిలుపు
- పోతరాజుల నృత్యాలు, డప్పుచప్పుళ్ల మధ్య స్టెప్పులేసిన జగ్గారెడ్డి

సంగారెడ్డి, జూలై 20 :

నిత్యం పొలిటికల్ ప్రసంగాలు, ప్రత్యర్థి పార్టీలకు కౌంటర్లు ఇచ్చే టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి కొత్త పాత్రలో కనిపించారు. సంగారెడ్డిలో ఆదివారం రాత్రి అట్టహాసంగా నిర్వహించిన బోనాల జాతర వేదికగా యువతకు హితబోధ చేశారు. గంజాయి తాగితే నరాలు పనిచేయవని, ఎందుకు పనికిరాకుండా పోతారని సూచించారు. మద్యానికి కూడా దూరంగా ఉండాలన్నారు. తల్లిదండ్రులను బాధపెట్టకుండా మంచి భవిష్యత్తు కోసం యువత శ్రమించాలని జగ్గారెడ్డి పిలుపునిచ్చారు. గంజాయితోపాటు మత్తుపదార్థాల జోలికి వెళ్లి తల్లిదండ్రులకు గుండెకోత మిగల్చవద్దని కోరారు. తల్లిదండ్రులను బాగా చూసుకోవాలని పదేపదే సూచించారు. జగ్గారెడ్డి సందేశాన్ని యువత ఆసక్తిగా విన్నారు. అంతకుముందు సంగారెడ్డి రాంనగర్ లోని తన ఇంటి నుంచి బోనంతో జగ్గారెడ్డి బయల్దేరారు. తన సతీమణి టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, శివశక్తి నిషా క్రాంతి బోనాలు ఎత్తుకున్నారు. ఈ ఊరే గింపులో పోతరాజు నృత్యాలు, డప్పు చప్పుళ్ల మధ్య జగ్గారెడ్డి స్టెప్పులు వేస్తూ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. పెద్ద సంఖ్య లో హాజరైన మహిళలకు బోనాల పండుగ శుభాకాంక్షలు చెప్పారు. అమ్మవారి ఆశీస్సులతో వర్షాలు బాగా కురుస్తున్నాయని సంతోషం వ్యక్తం చేశారు.

# సమస్యల పరిష్కారంలో ఏఐటీయూసీ విఫలం

శెనార్తి మీడియా, మంచిర్యాల:

సింగరేణిలో కార్మికులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు పరిష్కరించడంలో గుర్తింపు సంఘమైన ఏఐటీయూసీ పూర్తిగా విఫలమైందని సిఐటియు బ్రాంచ్ కార్యదర్శి అల్లి రాజేందర్ ఆరోపించారు. ఆదివారం పట్టణంలోని యూనియన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.స్ట్రక్చర్ సమావేశాల్లో సొంత ఇల్లు, మారుపేర్ల మార్పు, అలవెన్సులపై ఐటీ మాఫీ, క్యాడర్ స్కీమ్ డిమాండ్లపై కమిటీల పేరుతో కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. సమస్యలు పరిష్కరించాల్సిన బాధ్యత మరిచి, కార్మికులను మభ్యపెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు.కార్మికులు గుర్తింపు సంఘంపై ఆగ్రహం వ్యక్తం చేస్తుంటే, దానిని జీర్ణించుకోలేక ప్రతిపక్షాలపై దుష్ప్రచారం చేస్తున్నట్లు ఏఐటీయూసీ నాయకులు చెబుతుండటం సిగ్గుచేటని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో విడుదల చేసిన మేనిఫెస్టోను గుర్తుచేస్తూ, అమలు చేసి తమ చిత్తశుద్ధిని నిరూపించు కోవాలని సూచించారు.బాటా బూట్ల పంపిణీ, రక్షణ పరికరాల విషయం లో కూడా గుర్తింపు సంఘం నిర్లక్ష్యంగా వ్యవహరి స్తోందని, అడిగినప్పుడు తప్ప వాటిని పంపిణీ చేయడం లేదని ఆరోపిం చారు. మైన్స్, సేఫ్టీ కమిటీల సందర్భంలో నాయ కులు గనుల్లోకి దిగి ప్రత్యక్షంగా పర్యవే క్షించాలని డిమాండ్ చేశారు. యాజమా న్యంతో జరిగిన చర్చల వివరాలను నోటీ సు బోర్డుల ద్వారా కార్మికులకు తెలి యజే యాలని కోరారు.షిఫ్ట్ మార్పుల వల్ల కార్మికులు పని ఒత్తిడితో డ్యూటీకి హాజర య్యే పరిస్థితిలో లేరని, ఇది బొగ్గు ఉత్పత్తి పై ప్రభావం చూపుతోందని అన్నారు. యాజమాన్యం దీనిపై దృష్టి సారించి, కార్మికులతో చర్చించి సమస్యలు పరిష్క రించాలని విజ్ఞప్తి చేశారు. జె.వెంకటేష్, అలవాల సంజీవ్, నాగవెల్లి శ్రీధర్, ఏ.రాజ్ కుమార్, లింగాల రమేష్, బద్రి ఆదర్శ్, చైతన్య రెడ్డి, మహమ్మద్ తాజ్ పాల్గొన్నారు.

